GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 141 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- శుక్రవారం 27 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# మన్మోహన్ కు అనువాదకుడిగా

## పనిచేశా..మెచ్చుకున్నారు: విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి సురేశ్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి సురేశ్ అన్నారు.



హైదరాబాద్,డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి సురేశ్ అన్నారు. వాజ్పేయీ ప్రభుత్వం అమలు చేసిన విదేశాంగ విధానాన్ని ఆయన కొనసాగించారని చెప్పారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలో రష్యాలోని ఇండియన్ ఎంబసీలో పనిచేసినట్లు సురేశ్ తెలిపారు. అనువాదకుడిగా ఆయన్ను చాలా దగ్గరగా చూశానన్నారు."మన్మోహన్ గొప్ప ఆర్థికవేత్త. వివిధ దేశాల ప్రధానులతో జరిగిన సమావేశాల్లో ఆయనకు అనువాదకుడిగా పనిచేశాను. ఆ సమయంలో ఆయన్ను చాలా దగ్గరగా చూశా. ఎంతో నిరాడంబరంగా ఉండేవారు. మన్మోహన్ హయాంలో అమెరికాతో జరిగిన అణు ఒప్పందం ఎంతో కీలకమైంది. ఆ అంశంలో ఎన్నో విమర్శలు వచ్చినా ముందుకెళ్లారు. రష్యా, ఇతర దేశాలతో భారత్ బంధం పటిష్ఠం అయ్యేందుకు ఆయన చర్యలు తీసుకున్నారు. మన్మోహన్కు అనువాదకుడిగా పనిచేసిన సమయంలో ఓ రోజు ఆయన నా వద్దకు వచ్చి ప్రశంసించారు. బాగా అనువాదం చేశారని మెచ్చుకున్నారు. మరింత స్ఫూర్తితో పనిచేసేందుకు అది దోహదపడింది" అని సురేశ్ గుర్తుచేసుకున్నారు.

# మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు.



దిల్లీ, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరపున, దేశ ప్రజల తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా" అని మోదీ తెలిపారు.92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో నిన్న రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్బీఐ గవర్నర్ గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం (డిసెంబరు 28) రాజాఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# అధికారం దక్కలేదన్న అక్కసుతోనే జగన్ కొత్త నాటకాలు: ప్రత్తిపాటి

అధికారం దక్కలేదన్న అక్కసుతోనే జగన్ కొత్త నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు.



అమరావతి, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): అధికారం దక్కలేదన్న అక్కసుతోనే జగన్ కొత్త నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీల భారం జగన్ అవినీతిలో భాగమే అని పేర్కొన్నారు. ప్రజలపై భారం వేయడానికి ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది ఆయనేనని చెప్పారు."జగన్.. రాష్ట్ర విద్యుత్ రంగానికి చేసిన నష్టం రూ.1,29,503 కోట్లు. ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. దీంతో రూ.32,166 కోట్లు దండుకున్నారు. ఆయన పాలనలో విద్యుత్ సంస్థలపై వేసిన అప్పులే రూ.50 వేల కోట్లు" అని ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు.

# మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్రెడ్డి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నివాళులర్పించారు.



దిల్లీ, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నివాళులర్పించారు. బెళగావి నుంచి నేరుగా దిల్లీ వెళ్లిన సీఎం... అక్కడి నుంచి మన్మోహన్ నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్ఛార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పలువురు ఎంపీలు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది: ఎంపీ బాలశౌరి

మన్మోహన్ సింగ్ ( మృతితో దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని ఎంపీ వల్లభనేని బాలశౌరి



దిల్లీ, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో విద్యావేత్త, గుణ సంపన్నుడు. నిజాయతీపరుడు అని పేర్కొన్నారు. దేశంలో 35 కోట్ల చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. ఆయన హయాంలోనే గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని చెప్పారు. దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థ ఏర్పాటు చేశారన్నారు. 3జీ, 4జీలతో మొబైల్ విప్లవం మొదలైందని పేర్కొన్నారు."ఒక ఎంపీగా ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన నిరాడంబరుడు. పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన తీసుకున్న సంస్కరణలు, ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్, ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్గా, కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు అమూల్యం. ఆర్థిక మంత్రి కాగానే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి సంస్థలను ఒప్పించి భారతదేశాన్ని ఆర్థిక సుడిగుండం నుంచి బయట పడేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్. సుదీర్ఘ కాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస-్తున్నాను" అని బాలశౌరి పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా

సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.



హైదరాబాద్, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా పడింది. బెయిల్ పిటిషన్పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను సోమవారానికి (డిసెంబరు 30) వాయిదా వేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి న్యాయస్థానం విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో నేడు ఆయన వర్చువల్ న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు.మరోవైపు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10వ తేదీన చేపట్టనున్నట్లు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్పైనా విచారణ ఆ రోజే జరగనుంది.

# మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు

మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.



దిల్లీ, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని.. అనేక పదవులను సమర్థంగా నిర్వహించారని చెప్పారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, తెదేపా ఎంపీలు కేశినేని చిన్ని, శబరి మాజీ ప్రధాని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

# తెలంగాణకు మన్మోహన్తో ప్రత్యేక అనుబంధం : మాజీ సీఎం కేసీఆర్

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి (భారాస) నేతలు హాజరు కానున్నారు..



హైదరాబాద్, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి (భారాస) నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు."తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమయంలో ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనిది. తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్కు భారాస తరపున ఘన నివాళులు" అని కేసీఆర్ అన్నారు.

# ఏపీలో బీసీ మహిళలకు, యువతకు గుడ్ న్యూస్

## కురువ. రమేష్ (ప్రభుత్వ టెలికాం సలహా కమిటీ మెంబర్)



పాములపాడు, డిసెంబర్ 27 (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాలు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిద్ధమైందని ప్రభుత్వ టెలికం సలహా కమిటీ మెంబర్ నందికొట్కూరు నియోజవర్గ యువ నాయకులు కురువ.రమేష్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భముగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ యువ నాయకులు కురువ.రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దాదాపు 80వేల మంది బీసీ , ఈబీసీ మహిళలకు 90 రోజులపాటు టైలరింగ్ శిక్షణ ఇవ్వనుందన్నారు. ఆ తర్వాత రూ.24,000 విలువైన కుట్టు మిషన్లు అందిస్తుందన్నారు. అలాగే డీఫార్మా, బీఫార్మసీ కోర్సులు చేసిన యువత జనరిక్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు 8 లక్షల రూపాయలు సాయం చేయనుందన్నారు. ఇందులో 4 లక్షలు సబ్సిడీ, 74 లక్షలు రుణంగా ఉంటుందని,త్వరలోనే మార్గదర్శకాలు ఖరారు చేయనుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం యువతీ,యువకులకు ఎటువంటి సబ్సిడీ లోన్స్ లేకుండా చేసిందని, మన కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులలో ఆనందం వెల్లువిరుస్తుందని అన్నారు.

# 101 బస్సులలో 5000 మంది ఓం శక్తి మాల భక్తులు

కర్ణాటక రాష్ట్రం శివమెగ్గ ప్రాంతం నుంచి 101 కర్ణాటక ఆర్టీసీ బస్సులలో దాదాపు 5,000 మంది ఓం శక్తి మాల ధరించిన భక్తులు శుక్రవారం ఉదయం మంత్రాలయం చేరుకున్నారు.



మంత్రాలయం,డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): కర్ణాటక రాష్ట్రం శివమెగ్గ ప్రాంతం నుంచి 101 కర్ణాటక ఆర్టీసీ బస్సులలో దాదాపు 5,000 మంది ఓం శక్తి మాల ధరించిన భక్తులు శుక్రవారం ఉదయం మంత్రాలయం చేరుకున్నారు. కర్ణాటక రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప తమ సొంత ఖర్చులతో ప్రతి సంవత్సరం 101 బస్సులలో దాదాపు 5000 మంది ఓం శక్తి మాల ధరించిన భక్తులకు ఉచితంగా ప్రయాణం, భోజన వసతి కల్పిస్తూ తీర్థయాత్రలకు పంపిస్తున్నారని నిర్వాహకులు, భక్తులు తెలిపారు. శివమొగ్గ నుంచి 25వ తేదీ బయలుదేరిన 101 బస్సులలో దాదాపు 5,000 మంది భక్తులు శుక్రవారం ఉదయం మంత్రాలయంకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి తిరుపతి వెళ్లి వెంకటేశ్వర స్వామి దర్శించుకుంటామని, అనంతరం తమిళనాడు రాష్ట్రంలోని ఓం శక్తి ఆలయం అమ్మవారిని దర్శించుకొని ఈనెల 31వ తేదీ శివమొగ్గ తిరిగి చేరుకుంటామని భక్తులు పేర్కొన్నారు.

# అల్ట్రాటెక్ పరిశ్రమ యాజమాన్యానికి

## క్షమాపణ చెప్పిన జేసీ ప్రభాకర్ రెడ్డి

అల్ట్రా టెక్ పరిశ్రమ యాజమాన్యానికి క్షమాపణ చెబుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్రెడ్డి తెలిపారు.



అనంతపురం, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమకు బూడిద రవాణా చేసే లారీల విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తో కొన్ని రోజులుగా కొనసాగుతున్న వివాదంపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్రెడ్డి స్పందించారు. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి జేసీ క్షమాపణ చెప్పారు. ఆదినారాయణరెడ్డితో జరుగుతున్న గొడవతో పరిశ్రమకు, అక్కడ పనిచేసే వేలాది మంది కార్మికులకు నష్టం జరగకూడదనే సారీ చెబుతున్నట్లు జేసీ పేర్కొన్నారు.తమకు బూడిద రవాణా చేసే పర్మిట్ ఎంతో కాలంగా ఉందని జేసీ ప్రభాకర్రెడ్డి తెలిపారు. డబ్బుల కోసమే బూడిద రవాణా చేసే లారీలను ఆపామని కొందరు ఆరోపిస్తున్నారని.. దీనిలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. తాను ఏరోజూ డబ్బు కోసం రాజకీయాలను ఉపయోగించుకోలేదని చెప్పారు. తమకు చెందిన లారీలను అవతలి వ్యక్తులు నిలిపేసి అద్దాలు పగులగొట్టినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులతో పాటు జెన్కో అధికారులుకు కూడా ఫిర్యాదు చేశామన్నారు.డబ్బు సంపాదించడం కోసం రాజకీయాల్లో ఉండే అవసరం తమకు లేదని.. ముందు నుంచీ తమ కుటుంబం వ్యాపారాలు చేస్తూ ఉన్నత స్థితిలోనే ఉందని తెలిపారు. వైకాపా ప్రభుత్వం హయాంలో ఆర్థికంగా చాలా నష్టపోయినా ఎక్కడా తల వంచలేదన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా ఎదురు నిలిచి పోరాడానని చెప్పారు. కేవలం ఆత్మగౌరవం కోసమే ఇక్కడికి వచ్చిన లారీలను నిలిపివేశామని వివరించారు. ఈ క్రమంలో అల్ట్రాటెక్ లోని ఒక యూనిట్ లో ఉత్పత్తి ఆగిపోయి వేలాది మంది ఉపాధి కోల్పోయారని.. అందుకు ఆ సంస్థ యాజమాన్యానికి క్షమాపణ చెబుతున్నట్టు తెలిపారు. తన భార్య, కుమారులు హెచ్చరించడంవల్లనే మీడియా ముందుకు వచ్చి సారీ చెబుతున్నానన్నారు. ఈ విషయంలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలపై తమ కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని తెలిపారు.

# ఛార్జీలు పెంచినందుకే

## .. జగన్ కు ప్రజలు 'పవర్' పీకేశారు: మంత్రి డోలా

గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ధ్వజమెత్తారు.



విజయవాడ, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ధ్వజమెత్తారు. ప్రజలపై నాడు విద్యుత్ భారాలు మోపి.. నేడు ఏమీ తెలియనట్లు ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాను పెంచిన ఛార్జీలపై తన పార్టీ శ్రేణులతోనే ధర్నాలు చేయించడం సైకో చర్య అని దుయ్యబట్టారు. ఏపీఈఆర్సీ అనుమతించిన దాని కన్నా రూ.19 వేల కోట్లు అదనంగా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.యూనిట్ రూ.5కే వచ్చే విద్యుత్ను జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్లో రూ.8 నుంచి రూ.14కు కొనుగోలు చేసిందని ఆరోపించారు. సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజలపై భారం మోపేందుకు ఆనాడే ఏపీఈఆర్సీ అనుమతి కోరింది వాస్తవం కాదా అని నిలదీశారు. ఆయన అవినీతి, ధన దాహం వల్లే ప్రజలపై భారం పడిందని విమర్శించారు. పవర్ ఛార్జీలు పెంచినందుకే.. ఆయనకు ప్రజలు పవర్ పీకేశారన్న విషయం జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇకనైనా ప్రజలను మోసం చేయడం మానుకొని వాస్తవాలు గ్రహించాలని

# చెక్కపెట్టెలో మృతదేహం కేసు

## .. ఆ ముగ్గురే నిందితులు

పశ్చిమ గోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన చెక్క పెట్టెలో మృతదేహం కేసు దర్యాప్తు పూర్తయిందని ఎస్పీ నయీం అస్మి తెలిపారు.



ఏలూరు, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): పశ్చిమ గోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన చెక్క పెట్టెలో మృతదేహం కేసు దర్యాప్తు పూర్తయిందని ఎస్పీ నయీం అస్మి తెలిపారు. ఈనెల 19న సమాచారం రాగానే ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తు మొదలు పెట్టామన్నారు. ఈ కేసులో శ్రీధర్ వర్మ, అతడి రెండో భార్య రేవతి, వర్మ ప్రియురాలు సుష్మ పాత్ర ఉన్నట్లు తేల్చామని చెప్పారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు.

# మరియమ్మ హత్య కేసు

## ..మరో 34 మంది అరెస్టు

మరియమ్మ హత్య కేసులో 34 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



గుంటూరు, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): మరియమ్మ హత్య కేసులో 34 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తుళ్లూరు మండల పరిధిలోని వెలగపూడి గ్రామంలో 2020 డిసెంబరు 27న మరియమ్మ హత్య ఈ కేసులో ఇప్పటికే వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ను అరెస్టు చేసి రిమాండ్కు పంపారు. తాజాగా శుక్రవారం మరో 34 మందిని తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వీరిని మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు.

# 'మాకే ఎదురు చెబుతావా?'

## .. గాలివీడు ఎంపీడీవోపై వైకాపా నేతదాడి

అనమయ్య ల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై వైకాపా లీగల్సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు దాడికి



గాలివీడు,డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై వైకాపా లీగల్సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్రెడ్డి, అతని అనుచరులు దాడికి తెగబడ్డారు. గాలివీడు ఎంపీపీ పద్మావతమ్మ కుమారుడు సుదర్శన్రెడ్డి 20 మంది అనుచరులతో కలిసి శుక్రవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపీపీ ఛాంబర్ తాళం ఇవ్వాలని అడగ్గా.. ఎంపీపీకి మాత్రమే ఛాంబర్ తాళాలు ఇస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు.మాకే ఎదురు చెబుతావా? అంటూ జవహర్ బాబుపై సుదర్శన్రెడ్డి, అతని అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారు. కుర్చీలో నుంచి కిందపడిపోయినా ఆగకుండా కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దారు. తీవ్రంగా గాయపడిన ఎంపీడీవో జవహర్ బాబును పోలీసులు రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సుదర్శన్రెడ్డిని అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. దాడిలో పాల్గొన్న అతని అనుచరుల కోసం గాలిస్తున్నారు.

# కేటీఆర్ను అరెస్ట్ చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులు పొడిగింపు

ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది.



హైదరాబాద్, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది. కేటీఆర్ను అరెస్ట్ చేయకుండా గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం ఈనెల 31 వరకు పొడిగించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.గతంలో హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ కేసుపై ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్ను అరెస్ట్ చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది.

# పీహెచ్ విద్యార్థిని బలవన్మరణం

## .. ముగ్గురు నిందితుల అరెస్టు

కానిస్టేబుల్ వేధింపులు భరించలేక పీహెచ్ఎ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో




హైదరాబాద్, డిసెంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): కానిస్టేబుల్ వేధింపులు భరించలేక పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని దీప్తిని వేధించడంతో మనసాపానికి గురై ఉరేసుకుని బలవన్మరణాని పాల్పడింది. ఈ కేసులో సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలివీ. నాచారంలోని బాపూజీనగర్ సరస్వతీకాలనీకి చెందిన పులివర్తి దీప్తి(28) హబ్సిగూడలోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ప్రాజెక్టు అసిస్టెంట్గా పనిచేస్తున్నారు. దీప్తి తండ్రి సంగీతరావు ఐఐసీటీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. సంగీతరావుకు డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్గా పనిచేస్తున్న బెల్లా అనిల్తో పరిచయముంది.సంగీతరావు.. అనిల్ భార్య అనితకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో అనిల్ తన డబ్బు తిరిగివ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో చాలా ఏళ్ల నుంచి కలిసి ఉండడం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం ఠాణాలో ఫిర్యాదు చేయించాడు. దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. నాచారం పోలీసులు అనిత, అనిల్, సోమయ్య, సైదులు మీద కేసు నమోదు చేశారు."నా మరణానికి అనిల్, ఆయన భార్య అనిత, ఆమె తండ్రి సోమయ్య కారణం. నాన్న డబ్బు తీసుకుంటే నామీద నకిలీకేసు నమోదు చేయించి జీవితాన్ని నాశనం చేశారు. ఈ కేసుల మీద పోరాడే స్తోమత లేదు. నా మరణంతోనైనా కుటుంబానికి న్యాయం జరుగుతుంది. నా చావుకు కారణమైన వాళ్లకు శిక్షపడాలి. నా మృతదేహాన్ని వైద్య పరిశోధనకు ఇచ్చేయండి" అని కన్నీరు పెట్టుకుంటూ సెల్ఫీ వీడియో చిత్రీకరించింది. దీప్తి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రజా రిపబ్లిక్ స్పెషల్ 3


ప్రతి అక్షరం ప్రజల కోసం

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1571:** ప్రఖ్యాత జర్మన్ అంతరిక్ష పరిశోధకుడు జోహాన్స్ కెప్లర్ జననం (మ.1630).
- **1822:** ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ జననం (మ.1895). (చిత్రంలో)
- **1911:** జాతీయ గీతం జనగణమనను మొదటిసారి కలకత్తాలో కాంగ్రెసు సభల్లో పాడారు.
- **1945:** ప్రపంచబ్యాంకు ఏర్పాటయింది. 28 దేశాలు సంతకాలు చేసాయి.
- **1953:** ఆస్ట్రేలియాకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు కెవిన్ రైట్ జననం.
- **1956:** తమిళ సినిమా నటుడు, నిర్మాత ప్రభు గణేశన్ జననం.
- **1965:** బాలీవుడ్ చిత్రాలలో నటించే భారతీయ నటుడు సల్మాన్ ఖాన్ జననం.
- **1992:** అయోధ్యలో వివాదాస్పద స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది.
- **2007:** రెండుసార్లు పాకిస్థాన్ ప్రధానిగా పనిచేసిన బెనజీర్ భుట్టో మరణం (జ.1953).


జోహాన్స్ కెప్లర్


లూయీ పాశ్చర్


ప్రపంచబ్యాంకు



కెవిన్ రైట్


ప్రభు గణేశన్


సల్మాన్ ఖాన్


అయోధ్య


బెనజీర్ భుట్టో

రిపబ్లిక్ సినిమా CINEMA

# మహేశ్ వాయిస్ ఇచ్చిన 'ముఫాసా' .. కలెక్షన్స్ ఎంతంటే!

**మహేశ్ బాబు వాయిస్ ఇచ్చిన 'ముఫాసా: ది లయన్ కింగ్ మొదటివారం కలెక్షన్లను చిత్రబృందం ప్రకటించింది. ఇప్పటివరకు వచ్చిన వసూళ్లు ఎంతంటే**



ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కించిన 'ముఫాసా: ది లయన్ కింగ్' ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. మహేశ్ బాబు వాయిస్ ఇచ్చిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా మొదటివారం రూ.74 కోట్లు వసూలు చేసింది. ఇంగ్లిష్, హిందీ, తమిళ, తెలుగు భాషల్లో ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీని కలెక్షన్ వివరాలు వెల్లడిస్తూ చిత్రబృందం ఓ పోస్టర్ విడుదల చేసింది. ఇంగ్లిష్ లో రూ.26.75 కోట్లు వసూలుచేయగా.. హిందీ, తెలుగు భాషల్లో రూ.11.2కోట్లు, రూ.11.3 కోట్లు కలెక్షన్స్ సొంతం 'ది లయన్ కింగ్'.. నాలుగేళ్ల కిందట ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. దానికి ప్రీక్వెల్గా 'ముఫాసా: ది లయన్ కింగ్' రూపొందింది. టైటిల్ రోల్కు అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు వాయిస్ ఓవర్ ఇవ్వడంతో ఈ మూవీపై మరింత ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాకు డబ్బింగ్ అందించడంపై మహేశ్ ఆనందం వ్యక్తంచేశారు. "మనకు తెలిసిన, ఇష్టపడే పాత్రకు కొత్త అంకం. తెలుగులో 'ముఫాసా'కు వాయిస్ని అందించినందుకు చాలా సంతోషిస్తున్నా. ఈ క్లాసిక్ కి నేను విపరీతమైన అభిమానిని కావడంతో ఇది నాకెంతో ప్రత్యేకంగా ఉంది" అని తెలిపారు. మరోవైపు, ఈ సినిమా హిందీ వెర్షన్లో ముఫాసా పాత్రకు షారుక్ ఖాన్ ముఫాసా చిన్నప్పటి పాత్రకు ఆయన తనయుడు అబ్రం వాయిస్ ఓవర్ అందించారు. అలాగే ఇందులోని సింబా పాత్రకు షారుక్ పెద్ద కుమారుడు ఆర్యన్ ఖాన్ స్వరాన్ని అందించడం విశేషం.

# ఆమే.. నా బెస్ట్ ఫ్రెండ్: వెంకటేశ్

**నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న 'అని పబుల్ కార్యక్రమంలో సందడి చేశారు నటుడు వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విశేషాలతోపాటు వ్యక్తిగత విషయాలను కూడా పంచుకున్నారు.**



నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోన్న సెలబ్రిటీ టాక్ షో 'అన్ష్టపబుల్' తాజాగా ఈ కార్యక్రమంలో సందడి చేశారు వెంకటేశ్ త్వరలో విడుదల కానున్న 'సంక్రాంతికి వస్తున్నాం'ప్రమోషన్స్ భాగంగా ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినిమా విశేషాలతోపాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇందులోభాగంగా తన సతీమణి నీరజ గురించి వెంకటేశ్ మాట్లాడారు.'మీ బెస్ట్ ఫ్రెండ్ ఎవరు?' అని బాలయ్య ప్రశ్నించగా.. "నా సతీమణి నీరజ నా బెస్ట్ ఫ్రెండ్. ఆమె వల్ల వేరే బెస్ట్ ఫ్రెండ్స్ అవసరం రాలేదు. ఏమాత్రం సమయం దొరికినా మేమిద్దరం కలిసి టైమ్ స్పెండ్ చేయడానికి ఇష్టపడతాం. టూర్స్కు వెళ్తాం. ఆమెతో కలిసి నేను కూడా అప్పుడప్పుడూ గరిట తిప్పుతుంటా. అది నాకెంతో నచ్చుతుంది" అని వెంకీ బదులిచ్చారు. అనంతరం రానా గురించి మాట్లాడుతూ.. "చిన్నతనంలో తను చాలా సైలెంట్గా ఉండేవాడు. నా బెడ్ కింద దూరి.. సూపర్హీరో పాత్రల బొమ్మలతో ఎక్కువగా ఆడుకుంటూ ఉండేవాడు" అని నవ్వుతూ చెప్పారు. అలాగే, తన మేనల్లుడు నాగచైతన్య హగ్ చేసుకుంటే ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. ఇదే కార్యక్రమంలో ఆయన తన తండ్రి రామానాయుడు, తనయుడు అర్జున్ గురించి మాట్లాడారు. 'సంక్రాంతికి వస్తున్నాం' దర్శకుడు అనిల్ రావిపూడి, కథానాయికలు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ ఇదే ఎపిసోడ్లో సందడి చేశారు.'ఎఫ్ 2', 'ఎఫ్ 3' తర్వాత అనిల్ రావిపూడి వెంకటేశ్ కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రమే 'సంక్రాంతికి వస్తున్నాం'. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్ దీనిని నిర్మించారు. ముక్కోణపు క్రైమ్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఆయన భార్యగా ఐశ్వర్య రాజేశ్, మాజీ ప్రేయసిగా మీనాక్షి నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# కోహ్లి ఆటను చూసేందుకే నా చివరి క్షణం .. ఆఖరి డాలర్ వెచ్చిస్తా: లాంగర్

**గత కొన్ని రోజులుగా విరాట్ కోహ్లి ఫామ్తో ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. కానీ, ఇప్పటికీ అత్యుత్తమ క్రికెటర్ల జాబితాలో కోహ్లినే ఉంటాడని ఆసీస్ మాజీ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ వెల్లడించాడు.**



సచిన్ తెందూల్కర్, బ్రియాన్ లారా వంటి దిగ్గజ క్రికెటర్లతో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, మాజీ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ ఆడాడు. కానీ, వారందరి ఆటకంటే భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి గేమ్ ను చూసేందుకే ఇష్ట పడతానని వెల్లడించాడు. సచిన్, లారా అద్భుతమైన క్రికెటర్లే అయినా.. తన చివరి క్షణంలో వారందరికంటే కోహ్లి ఆటను చూసేందుకే ఆఖరి డాలర్ను వెచ్చిస్తానని వ్యాఖ్యానించాడు. అందుకు కారణాలనూ తెలిపాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా – భారత్ జట్ల మధ్య నాలుగో టెస్టు జరుగుతున్న విషయం తెలిసిందే. కోహ్లి తొలి ఇన్నింగ్స్లో 36 పరుగులు చేసి ఔటయ్యాడు."ఇప్పటికే నేను విరాట్ కోహ్లి అత్యుత్తమ ఆటగాడు అని చెప్పా. నేను చూసిన వారిలో అతడే బెస్ట్. అలాగని సచిన్, బ్రియాన్ లారా, రికీ పాంటింగ్ను తక్కువ చేసే ఉద్దేశం లేదు. వారిందరితోకలిసి ఆడిన అనుభవం నాకు ఉంది. నా దగ్గర ఒకే ఒక్క డాలర్ ఉందనుకుంటే.. లారా గేమ్ను చూసేందుకు ఇష్టపడతా. అలా కాకుండా ఒక్క డాలర్ తోపాటు ఒక్క క్షణమే ఉందనుకుంటే విరాట్గేమ్ను చూసేందుకే ఆసక్తి చూపిస్తా. విరాట్ బ్యాటింగ్ను ఇష్టపడతా. దీనికి కారణం లేకపోలేదు.కేవలం అతడు మంచి కవర్ డ్రైవ్ల కొడతాడనే కాదు. చాలా రీజన్లు ఉన్నాయి. బంతినిగమనించే తీరు బాగుంటుంది. వికెట్ల మధ్య పరిగెత్తడమూ సూపర్గా ఉంటుంది. ఇక అతడి ఫిట్నెస్ స్థాయి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్ని మ్యాచుల్లో విఫలమైనంత మాత్రానఅదేమీ సమస్య కాబోదు. కోహ్లి గొప్పతనమేంటో అతడి గణాంకాలే చెబుతాయి. అందుకే, అతడుప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్ అయ్యాడు" అని జస్టిన్ లాంగర్ వెల్లడించాడు.


## ఆరోగ్యం




# చలికాలంలో గుండెకు ట్రబుల్ ఎక్కువంట ..ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తపడండి..

ప్రస్తుత ఆధునిక కాలంలో చాలా మంది లైఫ్ స్టైల్ మీద ఎక్కువగా ఫోకస్ పెట్టడం లేదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఓ పక్కా ప్రణాళిక లేకుండా బతికేస్తున్నారు. సరైన టైంలో తినకపోవడం, జంక్ ఫుడ్ తినడం, స్మోకింగ్, డ్రింకింగ్ ఇలా ఓ పద్ధతి లేకుండా జీవిస్తున్నారు. దీంతో.. చాలా ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. అందులో ముఖ్యంగా ప్రపంచం మొత్తాన్ని భయపెడుతున్న ఓ అంశం ఒకటి ఉంది. అదే గుండెపోటు ఈ రోజుల్లో చాలా మంది గుండె పోటుతో ఆకస్మాత్తుగా చనిపోతున్నారు. యువత కూడా గుండె పోటు బారిన పడుతున్నారు.అయితే, చలికాలంలో గుండె పోటు ప్రమాదాలు ఎక్కువగా ఉ ంటున్నాయని నిపుణులు చెబుతున్నారు.అందుకే శీతాకాలంలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. వాతావరణ ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గిపోవటానికీ, గుండె జబ్బుల మధ్య సంబంధం ఉందని స్వీడన్లోని లండ్ విశ్వవిద్యాలయం పరిశోధనలు స్పష్టం చేశాయి. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఈ సీజన్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సీజన్లో ఎక్కువగా కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు పెరుగుతుంది. ఈ సీజన్లో గుండె సమస్యలు రావడానికి కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఇక్కడ తెలుసుకుందాం.

## చలికాలంలో గుండె సమస్యలు ఎందుకు ఎక్కువ?



గుండె కండరాలకు రక్తాన్ని సరఫరా చేసే కొరోనరీ ధమనులు మూసుకుపోయినప్పుడు హార్ట్ బ్లాక్ ఏర్పడుతుంది. చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం, చల్లగాలులు తీవ్రంగా వీచటం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుడం లాంటివి మనం గమనించవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మన శరీరంలో ఉష్ణోగ్రతను నెగ్గుకొచ్చే శక్తి తగ్గిపోతుంది. దీంతో.. ఆ ప్రభావం నేరుగా ఒంట్లోని అవయవాల మీద పడుతోంది. శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడాన్ని థర్మోగ్రూలేషన్ అంటారు. దీంతో రక్తనాళాలు చలికి ప్రతిస్పందించి.. ధమనుల్లో రక్తపోటు పెరిగిపోతుంది. దీంతో, తీవ్రమైన వణుకు, గుండెపోటు రావడానికి ఆస్కారం ఉంటోందని నిపుణులు అంటున్నారు. చల్లని వాతావరణంలో రక్తపోటు పెరుగుతుంది, ఇది గుండెపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది గుండె సమస్యలు ముప్పును పెంచుతుంది.

## హార్ట్ ఎటాక్ లక్షణాలు..

ఛాతీ నొప్పి, అసౌకర్యం

తరచుగా ఛాతీ బిగుతుగా అనిపించడం, ఒత్తిడిగా అనిపించడం జరుగుతుంది.

శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది



చిన్న పని చేసినా.. అలసటగా, బలహీనంగా అనిపిస్తుంది.

గుండెకు రక్త ప్రసరణ తగ్గి.. మూర్ఛ, మైకము వస్తాయి.

క్రమరహిత హృదయ స్పందన

కొందరు వ్యక్తులలో వికారం, చెమటలు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



వెచ్చగా ఉండండి..గుండె సమస్యలు ఉన్నవారు చలికాలంలో వెచ్చగా ఉండటానికి ప్రయత్నించండి. సాధారణ వ్యక్తులు కూడా శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే గుండె సేఫ్గా ఉంటుంది. వెచ్చగా ఉండటం కోసం ఉన్ని దుస్తులు ధరించండి. అలాగే, వేడి వేడి సూప్లు, స్మూతీలు తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఇవి చలి నుంచి కాపాడతాయి. దీంతో.. చలికి రక్తనాళాలు బ్లాక్ అవ్వకుండా ఉంటాయి.

## వ్యాయామం..



ప్రస్తుత హడావిడి లైఫ్లో వ్యాయామం అవసరమా అనే ప్రశ్న కొందరికి తలెత్తవచ్చు. శరీరంతో కష్టపడి పనిచేసే వ్యక్తులకు వ్యాయామంతో పనిలేదు. వారు ఎప్పుడూ ఫిట్గానే ఉంటారు. అయితే, శారీరక శ్రమ లేకుండా కూర్చొని పని చేసే వ్యక్తులకు వ్యాయామం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో చాలా మంది యువత కంప్యూటర్లపైనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. కూర్చోని పనిచేసే వాళ్లే ఎక్కువగా గుండె పోటు సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారు కొన్ని చిన్నపాటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది. వాకింగ్, యోగా, ధ్యానం లాంటివి చేయండి. చలికాలంలో చలి వాతావరణానికి వ్యాయామం చేయలేకపోతే ఇంట్లోనే చిన్న చిన్న ఎక్సర్సైజులు చేయండి.

## ఆహారం..



గుండెను కాపాడుకోవడం కోసం తినే ఆహారంపై కూడా దృష్టి పెట్టండి. గుండె బలంగా ఉంటాలంటే.. బెర్రీస్, పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు తీసుకోండి. ఆకుకూరలు, తృణధాన్యాలు కూడా గుండెని ఆరోగ్యంగా ఉంచుతాయి. సాల్మోన్ వంటి కొవ్వు చేపల్లో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. బాదం, వాల్నట్స్ వంటి గింజలు గుండెని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ఆహారాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు గుండె సమస్యలు రాకుండా మిమ్మల్ని కాపాడతాయి.

## ఒత్తిడికి చెక్ పెట్టండి..



ఈ రోజుల్లో చాలా మంది ఒత్తిడి సమస్యలతో బాధపడుతున్నారు. ఒత్తిడి వల్ల గుండె వ్యాధుల ముప్పు పెరుగుతుంది. అందుకే ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నాలు చేయండి. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో ఒత్తిడికి చెక్ పెట్టండి. నీళ్లు పుష్కలంగా తాగండి. డీహైడ్రేషన్ వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతున్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్లాన్ చేసుకుని ఒత్తిడికి చెక్ పెట్టండి.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.